దారులన్నీ బురదమయం

- కేటీదొడ్డి శివారు పొలాలకు మార్గం అధ్వానం
- వర్షాలు కురిస్తే అంతే సంగతి
- అవస్థలు పడుతున్న రైతులు


బురదమయంగా మారిన పొలాల దారి

కేటీదొడ్డి: రైతులు పొలాలకు వెళ్లే దారి బురద ఉండడంతో అవస్థలు పడుతున్నారు. కేటీదొడ్డి నుంచి రంగాపురం, బస్వాపురం వెళ్లే దారి ఉంది. వాగు నుంచి పొలాలకు చేరుకుంటారు. వర్షాలు కురిస్తే దారి బురదమయం అవుతోంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. బురద దారిలో వెళ్తూ వ్యవసాయ పనులు చేస్తున్నారు.

3 కి.మీ. బురదలో నడవాల్సిందే..

కుచినెర్ల, మల్లాపురానికి అనుకుని వందల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. ప్రతిరోజు రైతులు రోడ్డు దారిలో పొలాలకు చేరుతారు. వర్షాకాలంలో బురదగా మారే ఆ దారిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేటీదొడ్డి, కుచినెర్ల నుంచి పొలాలకు చేరాలంటే 3కి.మీ. నడవాల్సిన పరిస్థితి. ఈ దారిలో రెండు వంతెనలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది.


కేటీదొడ్డి మల్లాపురం రోడ్డు

కష్టంగా ఉంది..



నాకు 6 ఎకరాల భూమి ఉంది. అందులో వరి, వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. చేనుకు రావడానికి దారి బురదగా ఉంది. అధిక వర్షాలు కురిస్తే యూరియా బస్తాలను చేలకు తీసుకురాలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మించాలి.

– కొండయ్య, రైతు కేటీదొడ్డి

కేటీదొడ్డి నుంచి మల్లాపురానికి రోడ్డు నిర్మించాలి..



నాకు 8 ఎకరాల పొలం ఉంది. పొలానికి పోవాలంటే బురద దారిలో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. దారిలో వంతెన నిర్మించి రైతుల సమస్యలు తీర్చాలి.

– వీరన్న, రైతు కేటీదొడ్డి

పంటలను ఇంటికి, లేదా మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎడ్లబండి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది.

లింకు రోడ్డు నిర్మిస్తే ఉపయోగం..

కేటీదొడ్డి నుంచి మల్లాపురం వరకు లింకు రోడ్డు నిర్మిస్తే కష్టాలు దూరమవుతాయని రైతులు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మించాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నదీతీర గ్రామాల్లో ఆందోళన చెందకండి

రాజోళి: తుంగభద్ర నదీ తీర గ్రామాల్లో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని తహసీల్దార్ హరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక పరిధిలోని తుంగభద్ర డ్యాంలో గేటు కొట్టుకుపోవడంతో అక్కడి నుంచి భారీ వరద వస్తుందని, నదీ తీర గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మవద్దని ఆయన తెలిపారు. డ్యాం గేట్ కొట్టుకుపోయినప్పటికీ సంబంధిత అధికారులు ఇబ్బందులు కలగకుండా పనులు చేసే ప్రయత్నంలో ఉన్నారని, సుంకేసుల డ్యాం అధికారులతో కూడా మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారని, ఎలాంటి సమాచారమైనా అధికారులు చెబితేనే నమ్మాలని పేర్కొన్నారు. అనవసరంగా ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జూన్‌మాసంలో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో వెలుగులోకి వచ్చిన పాడైన స్తంభాలు మార్చడం, చెట్ల తొలగింపు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి, పిల్లిగుండ్ల, అయిజ రోడ్డు, ప్రభుత్వాసుపత్రి ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముళ్ల పొదలు తొలగించండి



అయిజ: పట్టణంలోని గుర్రం దొడ్డి కాలనీలో కొన్ని సంవత్సరాలుగా ముళ్లపొదలు దట్టంగా వ్యాపించాయి. ప్రధాన రోడ్లపై వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. రోడ్లకు ఇరువైపుల చెట్లు దట్టంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సంవత్సరాలుగా సమస్య ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ముళ్ల పొదలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం



మల్దకల్: మండలంలోని బిజ్వారంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా ఉంది. 16ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కమ్యూనిటీ భవనం ఎస్సీ కాలనీకి సమీపంలో ఉండటంతో బీసీ కాలనీ వాసులు వినియోగించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఈ కమ్యూనిటీ భవనం యాచకులకు, మద్యం ప్రియులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పగలే.. వెలుగులు



మానవపాడు: పగలే వెలుగుతూ విద్యుత్ దీపాలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు పగలు కూడా విద్యుత్ బల్బులు వెలుగుతూనే ఉన్నాయి. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నిపాడులో ప్రధాన కూడలిలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు వెలుగుతున్నాయి. విద్యుత్ బల్బులు వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రత్యేక అధికారుల పాలన నిర్లక్ష్యానికి నిదర్శనం అంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు



ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భాగంలో రహదారి పక్కన ప్రమాదకరంగా గుంతలు ఏర్పడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో గుంతలు కనబడక విద్యార్థులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్

హాస్టల్లో పందుల స్వైరవిహారం


మానవపాడు ప్రభుత్వ వసతిగృహంలో ధ్వంసమైన ప్రహరీ

మానవపాడు: మండలంలోని షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ వసతి గృహంలో 120మంది విద్యార్థులకు పైగా ఉంటున్నారు. నిత్యం భోజన సమయంలో వసతిగృహంలోకి పందులు సంచరిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువైయ్యారు. ప్రహరీ వెనుకభాగం రంధ్రం ఏర్పడడంతో పందులు వసతిగృహంలోకి వస్తున్నాయి. విద్యార్థులు కాలకృత్యాలు, స్నానాలు చేసే సమయంలో, భోజనం, టిఫిన్ చేసే సమయంలోనూ ఆహారం కోసం పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వసతిగృహం ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సంప్రదించవలసిన అధికారి: రామకృష్ణ, హాస్టర్ ఇన్‌చార్జి వార్డెన్, మానవపాడు సెల్: 9505282797

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు


ఎర్తింగ్ పనులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అయిజ: మండలంలోని పులికల్ గ్రామంలో ఐదు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఒక ట్రాన్స్ ఫార్మర్‌కు లోడ్ ఎక్కువ కావడంతో మొరాయిస్తుందని, రెండో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ కనెక్షన్ సరిగా లేకపోవడంతో విద్యుత్ సరఫరా కావడంలేదని ఏఈ నరేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం చిన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, మరొక ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్తింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇకపై నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. చాలామంది నివాస గృహాలకు విద్యుత్ మీటర్లు అమర్చలేదని, దానివల్ల నిబంధనల మేరకు పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు వీలుకావడం లేదని, గ్రామస్తులు వారి ఇండ్లకు విద్యుత్ మీటర్లను అమర్చుకోవాలని సూచించారు.

విద్యకు చట్టబద్ధత కల్పించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఎఫ్ స్టేట్ కో–ఆర్డినేటర్ భాస్కర్

కేటీదొడ్డి: బాలికల ఉన్నత విద్యకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎంవీఎఫ్ స్టేట్ కో –ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమైక్య టీఏ ఎస్ఎస్ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పేదలకు 25 శాతం రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేసి పేద బాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని మండలానికి, రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి విద్యార్థి బడి బయట కాకుండా బడి లోపల ఉండేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కిరణ్, ఎంవీఎఫ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

‘బంగ్లా’లో హిందువులను రక్షించాలి


ఉండవెల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంఘాల నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బీజేపీ, హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే అరాచకాలను ఆపాలని, వారిని కాపాడాలని ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ‘సేవ్ హిందూస్ ఇన్ బంగ్లా’ అంటూ నినాదాలతో పురవీధుల్లో ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వం హిందువులను తక్షణమే కాపాడాలని, తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పిడుగు వెంకటేష్, మంద్ర, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, నాయకులు నరసింహ, పరుశ, హనుమంతు, కర్ణాకర్ రెడ్డి, బీముడు, తదితర్లు పాల్గొన్నారు.

నివాస గృహాలపై ఎగిరిన జాతీయ జెండా


జాతీయ జెండాను ఎగురవేసిన బీజేపీ నాయకులు

అయిజ: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వివిధ పట్టణంలో కొంతమంది ప్రజలు వారి నివాస గృహాలపై జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ నివాస గృహంపై బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్‌రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలలో వర్షపునీరు



మానవపాడు: మండలంలోని గోకులపాడు, కలుకుంట్ల, చెన్నిపాడు, పెద్దపోతులపాడు రోడ్లపై వర్షపునీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలతో నీరునిండి వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రాత్రి సమయంలో గుంతల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై గుంతలను పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డుపై గుంతలు పూడ్చాలి



మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని సద్దలోనిపల్లి–మల్దకల్ గ్రామాల మధ్యన బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఐదేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో ప్రతినిత్యం వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాహనదారులు కిష్టన్న, తిమ్మప్ప, రాముడు, నర్సింహులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి


మహబూబీ(ఫైల్)

రాజోళి: విధులకు హాజరవుతూ ఆదివారం మృతి చెందిన ఆశా కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, యూనియన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన మహబూబీ(50)ఆశా కార్యకర్తగా సేవలందిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నాలుగు రోజుల నుంచి వ్యాక్సిన్ డ్యూటీలకు, శిక్షణ కార్యక్రమాలకు హాజరైనట్లు కుటుంబ సభ్యులు తెలి పారు. శనివారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో రాత్రి కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు నివాళులర్పించారు. అనంతరం పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుంగ్‌ఫూ, కరాటే పోటీలు


బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్లు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో ఆదివారం కుంగ్‌ఫూ, కరాటే యుద్ధ విద్యల బెల్ట్ కోసం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కుంగ్‌ఫూ, కరాటే మాస్టర్లు విజయ్, రాజు ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల్లో రెండు సంవత్సరాలుగా కుంగ్‌ఫూ, కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులు యుద్ధ విద్యల బెల్ట్ కోసం కుంగ్‌ఫూ కటాస్ స్పారింగ్, జిమ్నాస్టిక్ వెపన్ కటాస్, తదితర విద్యలను ప్రదర్శించారు. పోటీల్లో మెరిట్ ఆధారంగా మాస్టర్లు వారికి బెల్టులు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో పరిపూర్ణాచారి, మన్నెం, నర్సింహులు, శేషు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

అలంపూర్: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన విజయోత్సవ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడ్డాకుల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేయడంతో, సుప్రీం కోర్టులో అనుకూలమైన తీర్పు వెలువడిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన ఢిల్లీ నుంచి వస్తున్న మంద కృష్ణకు ఘన స్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీ, అనంతరం జరిగే సభకు మాదిగ ఉద్యోగులు, మాదిగ సోదరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

శాంతినగర్: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మధుబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జూలెకల్, కొంకల, బుడమొర్సు, కోయిల్‌దిన్నె గ్రామాల్లోని పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందక, కుటుంబాలు గడువక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

అద్దె భవనాల్లో ఇంకెంతకాలం?

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


మల్దకల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, మౌలిక వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాలయాల లేమీతో అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు మంచి నీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కేంద్రాలలో మరుగుదొడ్లు ఉన్నా, శిథిలావస్థకు చేరాయి. అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వాటి ఆవరణలో పెరటి తోటలు సాగుచేసి వాటి ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా అది అమలు కావడం లేదు. మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 30 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో మొత్తం 2793మంది చిన్నారులు ఉన్నారు. 759 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి



గ్రామంలో 6 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 2వ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

– సునీత, మల్దకల్

అద్దె భవనంలో వసతుల్లేవు..



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– పుష్పలత, అంగన్‌వాడీ టీచరు, మల్దకల్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను పరిశీలించి నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందజేస్తాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సొంత భవనాల కోసం ఇప్పటికే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కమాలాదేవి, సీడీపీఓ

మొక్కలు నాటిన యువకులు

శాంతినగర్: రోడ్ల వెంట ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి ఔదార్యాన్ని చాటుకున్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామానికి చెందిన యువకులు వెంకటేశ్వర్లు, మోహన్, వెంకటేష్ యాదవ్‌లు జక్కిరెడ్డిపల్లి రోడ్డుకు ఇరువైపుల ఆదివారం మొక్కలు నాటారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి ఖాళీగా ఉన్న పాదుల్లో మొక్కలు నాటారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com